క్లుప్తంగా

పార్టీ నేతలతో నేడు సమావేశం

పెదపూడి: అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ ముఖ్య శ్రేణులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట మండలాల పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు



వడిశలేరులో కుక్కకు టీకా వేస్తున్న వెటర్నరీ వైద్యుడు

రంగంపేట: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై జంతు ప్రేమికులు, పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని పశు వైద్యుడు ఈ.జాన్‌పాల్ అన్నారు. జునోసిస్ డే సందర్భంగా వడిశలేరులో శనివారం పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మురళీ కృష్ణ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేయాలి

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో మురుగు కాలువల్లో సిల్ట్ తొలగించి ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి, కరకుదురు, రామేశ్వరం గ్రామాల్లో మురుగు కాలువల్లో సిల్ట్‌ను జేసీబీ సాయంతో తీస్తున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో తీసిన పూడిక మట్టిని అక్కడి నుంచి తరలించాలన్నారు. దీనివల్ల దోమలు, ఇతర అనారోగ్య పరిస్థితులు ప్రబలకుండా ఉంటాయన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పారిశుధ్య చర్యలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీటి క్లోరినేషన్‌పై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కచ్చితంగా పర్యవేక్షించాలన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురానికి చెందిన పులపర్తి పూర్ణ అంజలీదేవి (28) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై ఆనంద కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయంలో అప్పులు పెరిగిపోవడంతో భర్తతో ఆమెకు వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అంజలీదేవి శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను వెంటనే స్థానికుల సహాయంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి గోసంశెట్టి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న కేసు నమోదు చేశారు.

21న గురుపూర్ణిమ

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న గురుపూర్ణిమ వేడుక జరగనుంది. తెల్లవారుజామున 5.15 గంటలకు నిర్వహించే కాకడ హారతి అనంతరం 5.45 గంటల నుంచి బాబా మూలవిరాట్‌కు భక్తులే స్వయంగా క్షీరాభిషేకం చేసుకునే అవకాశం ఉంది. అనంతరం సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణ జరుగుతుంది. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తారు.

చోరీ జరిగిన ఆలయం పరిశీలన



ఎస్‌ఐ శోభన్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శివారు సూర్యనారాయణపురంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శోభన్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు పద్మనాభరెడ్డి, గంగిరెడ్డిలతో మాట్లాడి చోరీ ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిందితుడిని పట్టుకుని స్వామి ఆభరణాలు రికవరీ చేయాలన్నారు.

గ్రామాలను నందనవనంగా మార్చుకోవాలి

బిక్కవోలు: ప్రతిఒక్కరూ మొక్కలను పెంచడం ద్వారా గ్రామాలను నందనవనంగా మార్చుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొంకుదురులో కొబ్బరి, వేప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- అతిసార వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది చర్యలు
- రెండు నెలల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమం



తొస్సిపూడిలో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బిక్కవోలు: అతిసార వ్యాధిగా కూడా పిలిచే డయేరియా వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాల మీదకు వస్తుంది. అపరిశుభ్రమైన, కలుషితమైన నీటిని తాగడం వల్లే డయేరియా వ్యాపిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకూ డయేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు కలుషితమైన తాగునీటిని తాగకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

అతిసార వ్యాధి లక్షణాలు

విరేచనాలు నీళ్లలాగా పలుచగా అవుతుందంటే డయేరియా అని అర్థం. కలుషితమైన నీటిని తాగినా, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి. వరుసగా విరేచనలు కావడంతో నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు తగ్గిపోయి కాళ్ల నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్‌కు గురై ప్రాణాపాయం సైతం కలిగే అవకాశముంది. అందుకే డయేరియా నుంచి రక్షించుకునేందుకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, సాధ్యమైనంత వరకూ వేడి పదార్థాలనే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. మాంసాహారం, ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉండే వాటిని తీసుకోకూడదని హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధుల విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవడం అవసరమంటున్నారు.

కలుషిత నీటితోనే ప్రమాదం



కలుషిత నీటితోనే అతిసారం సోకుతుంది. అందుకే ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగడం మంచిది. ఎవరికైనా డయేరియా సోకితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి వైద్యులకు చూపించుకోవాలి.

– డాక్టర్ జి.విజయలక్ష్మి, కొంకుదురు, పీహెచ్‌సీ వైద్యురాలు

రెండు నెలలు ప్రత్యేక క్యాంపులు

స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది రెండు నెలల పాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి డయేరియా బాధితులను గుర్తిస్తున్నారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు వెళ్లి విరేచనాలతో బాధపడే చిన్నారుల ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్‌లు సర్వేలో పాల్గొంటున్నారు. పిల్లలకు తల్లి పాలు అందజేస్తూ అవసరమైతే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లలోని పౌడర్‌ను నీళ్లలో కలిపి పట్టించాలని సూచిస్తున్నారు.

కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రంగంపేట: కొండేపూడి ధనరాజు(నాని) స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని గౌతమీ నేత్రాలయం సిబ్బంది రోగులను పరీక్ష చేశారు. పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలోని వెలమర్తి సుధాకర్, తోట సూరిబాబు, పేపకాయల వెంకన్న పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేద్దామన్నారు. ఏపీవో నాగశేషవేణి మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ మండలంలో జరిగిన 1,098 పనులకు సంబంధించి కూలీల చెల్లింపులు రూ.7.52 కోట్లు, మెటీరియల్‌కు రూ.94.86 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. అనంతరం గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ వివరాలు వివరించారు. ఐదు గ్రామాల్లో మస్టర్లలో కొట్టివేతలు, దిద్దివేతలు, కొలతల్లో తేడాలు ఉండటంతో రూ.52 వేలు జరిమానా విధించారు. వీటిని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లించాల్సి ఉంది. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.ముఖలింగం, ఏపీడీ బొల్లిశెట్టి రాంప్రసాద్, అంబుడ్స్‌మెన్ షేక్ ఖాదర్ బాషా, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న తహసీల్దార్ పాల్‌బాబు, బీజేపీ నాయకులు



దొంతమూరులో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు అన్నారు. అమ్మ వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ మండల కన్వీనర్ గూడపాటి జయరామ్, ఓబీసీ మండల అధ్యక్షుడు దాసరి సుబ్బారావు, యూత్ అధ్యక్షుడు నల్లజర్ల నరేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై టి.రామకృష్ణ మొక్కలు నాటారు. అనంతరం సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్ద జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్సై రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పర్యావరణ రక్షణకు కృషి

రంగంపేట: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా శనివారం జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సోడసాని ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పందలపాక గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ సబ్బారపు పద్మావతి

బిక్కవోలు: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ సబ్బారపు పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని పందలపాక గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను అరికట్టడంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యప్రసాద్, ఉపసర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, ఎంపీటీసీ మచ్చా పాప, పంచాయతీ వార్డు సభ్యులు మల్లిరెడ్డి వీర దుర్గాప్రసాద్, గుళ్లపల్లి వీరవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి



తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకటరమణ చౌదరి

సీతానగరం: రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. శనివారం పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్‌లో మోటార్లకు పూజ చేసి, సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయకట్టు శివారు వరకూ సాగునీటిని అందిస్తామన్నారు. రెండు పంటలకు పుష్కలంగా సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పురుషోత్తపట్నంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు కిట్లు అందజేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. ఎంఈవో కె.స్వామినాయక్, హెచ్‌ఎం కన్నూరి సతీష్‌బాబు పాల్గొన్నారు.

నన్నయలో అక్రమాలపై విచారణ జరపాలి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరపాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన శనివారం యూనివర్సిటీకి వెళ్లి.. పలు అంశాలపై ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మతో మాట్లాడారు. రాష్ట్రంలో అతిపెద్ద యూనివర్సిటీగా ఉన్న నన్నయలో.. అదే స్థాయిలో కోట్లాది రూపాయల మేరకు అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. కొత్తగా అనుమతులిచ్చిన కళాశాలలు, వాటి వివరాలతో పాటు ముఖ్యంగా ఇక్కడ వీసీలుగా బాధ్యతలు నిర్వహించిన ఎం.జగన్నాథరావు, కె.పద్మరాజు హయాంలో చేపట్టిన నిర్మాణాలు, ఇచ్చిన కాంట్రాక్టులు, బోధన, బోధనేతర విభాగాలలో చేసిన నియామకాలపై పూర్తి సమాచారం ఇవ్వాలని రాతపూర్వకంగా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌ను కోరారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత కూడా యూనివర్సిటీలో 40 మందికి వివిధ కేటగిరీలలో ఉద్యోగాలు ఇచ్చారన్నారు. వీసీగా రాజీనామా చేసిన తరువాత కూడా పాత తేదీలతో సంతకాలు చేయాల్సిన అవసరం ఏమిటన్నారు.

బకాయిల కోసం మొక్కజొన్న రైతుల దీక్ష



దీక్ష చేపట్టిన మొక్కజొన్న రైతులు

మధురపూడి: కోరుకొండ – కాపవరం రహదారిని ఆనుకొని మునగాల మొక్కజొన్న రైతులు దీక్షలు ప్రారంభించారు. కావేరి హైబ్రీడ్ మొక్కజొన్న కంపెనీ నుంచి తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన చేపట్టారు. రైతు నాయకుడు గిద్దా వెంకట సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ 'గతేడాది సీజన్‌లో కావేరి కంపెనీ హైబ్రీడ్ మొక్కజొన్న కంపెనీ విత్తనాలతో సాగుచేశామని, పంట దిగుబడి తక్కువగా ఉందన్న కారణంగా పూర్తి నగదు చెల్లించలేదన్నారు. దీంతో ఆ బకాయిలు ఇవ్వాలని కోరుతూ నిరసన చేపట్టామన్నారు. దీనికి ముందు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించినప్పటికీ చర్యలు లేవన్నారు. కంపెనీ ఆర్గనైజర్ అడపా కనకరాజు హామీ మేరకు తుపాన్ అనంతరం సాగు చేసినందున, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం బకాయిలు ఇవ్వాలన్నారు. నిరశనలో మునగాలకు చెందిన మొక్కజొన్న రైతులు మండపాక వెంకటరాజు, కొండపల్లి వీర్రాఘవులు, మండలపాక విష్ణుమూర్తి, కడెం ఏసు పాల్గొన్నారు. కాగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చి, రైతులతో దీక్ష విరమింపజేశారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం



శిబిరంలో మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

కంబాలచెరువు: ఖైదీల ఆరోగ్య భద్రతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని రాజమహేంద్రవరం కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. ఖైదీల నేత్ర పరీక్షలకు సంబంధించి రెండో దశ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఖైదీలకు కళ్లజోళ్లు సమకూర్చడం కోసం పరమహంస యోగానంద నేత్రాలయ ట్రస్ట్‌కు రూ.25 వేలు అందించిన ఆమెన్ ట్రస్ట్ ప్రతినిధులు ఇవాంజిలిన్, అశోక్‌లను అభినందించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ జైళ్లలో అందిస్తున్న సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక పరివర్తన చెంది, విడుదలైన తర్వాత కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడాలన్నారు. పరీక్షల అనంతరం కంటి లోపాలున్న ఖైదీలకు మందులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.రత్నంరాజు, జైలర్లు ఆర్.శ్రీనివాసరావు, కేవీ రామారావు, సీహెచ్ రమేష్, సురేష్ కుమార్, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం కో ఆర్డినేటర్ ఎస్.చంటిబాబు, డాక్టర్ కోమల, సోషల్ ఇంక్యుబేషన్ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి



సత్యసాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయిబాబా శతజయంతిని అందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శనివారం రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. పదాధికారులు బాధ్యతతో సంస్థల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అఖిల భారత సమన్వయకర్త ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ నవసూత్ర నియమావళిని పాటించి ఆధ్యాత్మికంగా, వ్యక్తిగత సాధన చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు గ్రామ గ్రామానా ఎలా నిర్వహించాలో వివరించారు. సమావేశంలో సౌత్ జోన్ సమన్వయకర్త ముకుందన్, జాతీయ మహిళా విద్యావిభాగ సమన్వయకర్త శశిబాల, పి.గోపికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముందుగా బాబా నివాస ప్రాంతం నుంచి గురుకులం విద్యార్థుల వేద పఠనంతో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అఖిల భారత అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రశాంతి పతాకను ఆవిష్కరించారు. రాష్ట్ర సేవా సమన్వయకర్త కొమరగిరి శ్యామ్ ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామసుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపరలో ప్రాచీన అలివేలు మంగ సమేత కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ మాసం పాడ్యమి సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి తులసి, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తులతో గోవిందనామాలు ఆచరింపజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



కణుపూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నాయకులు

మధురపూడి: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. కోరుకొండ మండలంలో శనివారం ఆయన వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కణుపూరు, మధురపూడి, బుచ్చెంపేట తదితర గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, కన్వీనర్ మద్దాల చంటిబాబు, కో కన్వీనర్ మంచాల చిట్టిబాబు, పైడిమళ్ల ధనరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ

కంబాలచెరువు: స్థానిక వీరభద్రపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ), అమ్మఒడి సేవా తరంగిణి సంస్థల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. జేసీఐ మెంటార్, ప్రముఖ టెడ్ లెన్స్ ఐటీ సొల్యూషన్స్, ఐ –గురుకుల్ అధినేత జేసీ రామ్ కుమార్ రామ్‌దేవ్ మాట్లాడుతూ తాను ఈ స్కూలులోనే చదువుకున్నానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అమ్మఒడి సేవా తరంగిణి కార్యదర్శి శివస్వామి మాట్లాడుతూ మన దేశ గొప్పదనాన్ని వివరించారు. భారతీయ సంస్కృతిపై ప్రశ్నలు వేసి, సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా తరంగిణి కోశాధికారి నాగమణి, జేసీఐ సభ్యులు మోహన ప్రియ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ధవళేశ్వరం: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లేఖ రాసినట్లు ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు వేతన సవరణ కమిటీ వేయాలని కోరారు.

జై జగన్నాథ..

- నేడు రథయాత్ర
- శ్యామలా నగర్ నుంచి ఇస్కాన్ వరకూ నిర్వహణ
- పూర్తయిన ఏర్పాట్లు



ఇస్కాన్ మందిరం



జగన్నాథుడు, బలదేవుడు, సుభద్రల విగ్రహాలు

సీటీఆర్‌ఐ: జగన్నాథస్వామి రథయాత్రకు సర్వం సిద్ధమైంది. భక్తులకు దర్శన భాగ్యం కల్పించడానికి భగవంతుడు పుర వీధులలో ఊరేగనున్నాడు. ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శ్యామలా నగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుంది. ఏటా పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అదే విధంగా ఇస్కాన్ మందిరంలో కూడా జగన్నాథ స్వామి కొలువై ఉండడంతో ఇక్కడ కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. కానీ జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఉంచి ఊరేగించడం ప్రత్యేకత. మందిరానికి రాలేని భక్తుల కోసం స్వామి వారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ఉద్దేశం. కీర్తనలు, భజనల నడుమ జగన్నాథ, బలదేవ, సుభద్రల విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగింపు నిర్వహిస్తారు.

రథయాత్ర సాగుతుందిలా..

శ్యామలా సెంటర్ రామాలయం నుంచి మొదలైన రథయాత్ర గోరక్షణ పేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్‌కు చేరుకుంటుంది. రథయాత్రలో భాగంగా తరలివచ్చిన భగవంతుని దర్శించుకుని భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. గతేడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా, ఈ సారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి మొదలు కానుంది. రథయాత్ర ముగిసిన తర్వాత జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాల భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ జరుగుతాయి.